ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 25 జనవరి 2024



ఎన్నికల్లో సెక్టార్ అధికారులు కీలకం: జేసీ

పార్వతీపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో సెక్టార్ అధికారులు కీలకమని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సెక్టార్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో చేయాల్సిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణా సమయంలో సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను విధిగా పాటించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో కలవరం







- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటనతో శ్రేణుల్లో జోష్
- వైఎస్సార్‌పై అభిమానంతో కాంగ్రెస్ వైపు జిల్లావాసుల చూపు
- టెన్షన్‌లో అధికార పార్టీ నేతలు
- ఓట్లు చీలిక తప్పదని ఆందోళన
- రానున్న ఎన్నికల్లో నష్టం చేకూరుతుందని గుబులు

పార్వతీపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి)

జిల్లా వైసీపీలో గుబులు మొదలైంది. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దూకుడుగా వ్యవహరిస్తుండడంతో ఆ పార్టీ నేతల్లో ఆందోళన నెలకొంది. రానున్న ఎన్నికల్లో పరిస్థితి ఎలా ఉండబోతోందోనని మథపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత షర్మిల జిల్లాల్లో పర్యటనలకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఇటీవల విజయనగరం జిల్లాలో పర్యటించారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వారి ద్వారా ఉమ్మడి జిల్లాలో సమస్యలు తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ఎలా వ్యవహరించాలనే దానిపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మరోవైపు సీఎం జగన్‌పై ఘాటు విమర్శలు చేశారు. మద్యపాన నిషేధం, జాబ్ క్యాలెండర్, ప్రాజెక్టుల నిర్మాణం తదితర హామీలు నెరవేర్చని సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు ఉందా? అని ప్రశ్నించారు. మొత్తంగా మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల తన సోదరుడు సీఎం జగన్‌పై ప్రత్యక్షంగా విమర్శలు గుప్పిస్తుండడంతో వైసీపీ శ్రేణుల్లో కలకలం మొదలైంది. రానున్న ఎన్నికల్లో తమ పార్టీకి ఎంతవరకు నష్టం చేకూరుతుందోనని టెన్షన్ పడుతున్నారు. మరోవైపు షర్మిల రాకతో ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ నేతల్లో జోష్ పెరిగింది. నూతనోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. వైసీపీ ఓటమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు.

ఆ ఓట్లు దూరం కానున్నాయా?

మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంతో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో అనేక మందికి సత్సంబంధాలు ఉన్నాయి. ఆ కారణంగానే గత ఎన్నికల్లో జగన్‌కు మేలు జరిగిందని చెప్పొచ్చు. వైఎస్ఆర్‌పై ఉన్న అభిమానంతో అనేకమంది వైసీపీకి ఓట్లు వేశారు. రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభిమానులు సైతం వైసీపీ వైపు మొగ్గు చూపారు. ఆ పార్టీ నుంచి పోటీ చేసిన వారికి మద్దతు తెలిపారు. దీంతో గత ఎన్నికల్లో వైపీపీ విజయం సాధించింది. అయితే ఇప్పుడు సీన్ మారింది. వైసీపీకి ఆయా ఓట్లన్నీ దూరమయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. వైఎస్సార్ కుమార్తె షర్మిల పీసీసీ అధ్యక్షురాలిగా పగ్గాలు చేపట్టడంతో కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కొంత మంది వైసీపీ నేతలు సైతం హస్తం వైపు చూస్తున్నారు. ఈ నెల 23న విజయనగరంలో షర్మిల పర్యటన విజయవంతం కావడమే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, నేతలు, అభిమానులు పెద్దఎత్తున అక్కడకు తరలివెళ్లారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు చెందిన కొంతమంది వైసీపీ నేతలు సైతం షర్మిలతో మాట్లాడినట్టు సమాచారం. దీంతో వచ్చే ఎన్నికల్లో వైసీపీకి జిల్లాలో తీవ్ర నష్టం ఏర్పడే పరిస్థితి కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

వైసీపీకి నష్టం ఎలా అంటే?

కాంగ్రెస్ పార్టీ గుర్తు హస్తం. నేటికీ జిల్లాలోని కొన్ని సామాజిక వర్గాల్లో బలంగా ఆ గుర్తు నాటుకుపోయింది. కాంగ్రెస్ వీరాభిమానులు సైతం ఎంతోమంది ఉన్నారు. ఎవరెన్ని చెప్పినా ఇటువంటి వారు.. మరో గుర్తు వైపు చూడకుండా హస్తం వైపు మొగ్గుచూపే పరిస్థితి ఉంది. అయితే ప్రస్తుతం జిల్లాలో ప్రథమ శ్రేణి కాంగ్రెస్ నాయకులు లేకపోయినప్పటికీ భవిష్యత్‌లో సీన్ మారే అవకాశాలున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీలో వన్‌మ్యాన్‌షో జరుగుతోంది. కొంతమంది వైసీపీ నేతలు దానిని జీర్ణించుకోలేక పోతున్నారు. గౌరవం లేని చోట ఉండే కన్నా.. బయటకు రావడమే మేలని అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. అధికారం ఉన్నా లేకపోయినా గౌరవం ఉన్న పార్టీలో ఉండడం మంచిదని యోచిస్తున్నారు. మొత్తంగా తమ రాజకీయ భవిష్యత్ బాగుండాలంటే.. కాంగ్రెస్‌లో చేరడమే ఉత్తమమని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలో కొన్ని నియోజకవర్గాలకు చెందిన వైసీపీ నేతలు కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టే అవకాశం కనిపిస్తోంది. ఇదే జరిగితే రానున్న ఎన్నికల్లో వైసీపీకి అన్ని విధాలుగా నష్టం చేకూరే పరిస్థితి లేకపోలేదు.

టీడీపీకి ఎలా లాభం అంటే...

జిల్లాలో కొన్ని సామాజిక వర్గాలు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి దగ్గరగా ఉన్నాయి. గత ఎన్నికల్లో కూడా ఆయా వర్గాలు వైసీపీకి భారీ మెజార్టీని తెచ్చిపెట్టాయి. అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో వారంతా తిరిగి కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. షర్మిల నాయకత్వంలో పార్టీ బలోపేతం కావాలని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్ఆర్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు ఓట్లు హస్తం గుర్తుకే పడే అవకాశం ఉంది. దీంతో వైసీపీకి ఆయా ఓట్లన్నీ దూరం కానున్నాయి. గత ఎన్నికల్లో ఏ ఓట్లుతో అయితే వైసీపీ నేతలు మెజార్టీ పొందారో.. అవన్నీ ప్రస్తుతం కాంగ్రెస్ వైపు చూస్తున్నాయి. ఓట్లు చీలిక కారణంగా వైసీపీకి తీవ్ర నష్టం ఏర్పడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే టీడీపీకి వచ్చే నష్టమేమీ లేదని, ఓ రకంగా లాభం చేకూరినట్టేనని అభిప్రాయ పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉన్న నేపథ్యంలో అన్ని వర్గాలు ఇప్పుడు టీడీపీ వైపే చూస్తున్నాయి. మరోవైపు వైసీపీ సర్పంచ్‌లు, వారి అనుచరులు, కార్యకర్తలు, నేతలు పెద్దఎత్తున కుటుంబాలతో సహా టీడీపీలో చేరుతున్నారు. ఇది ఆ పార్టీకి కలిసొచ్చే అంశమని వారు చెబుతున్నారు.

ఓటు బ్యాంకు ఇలా..

కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో కొంత ఓటు బ్యాంకు ఉంది. ఆ పార్టీ తరపున ఎవరు పోటీ చేసినా వారికి పెద్ద ఎత్తున ఓట్లు పడే పరిస్థితి ఉంది. రాష్ట్ర విభజన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులెవరూ ముందుకు రాలేదు. ఆ పార్టీ నుంచి కొన్ని స్థానాల్లో పోటీ చేసిన వారికి కనీసం పది నుంచి 15 వేల ఓట్లు పడ్డాయి. కాంగ్రెస్ పార్టీపై ఆగ్రహంతో ఉన్న సమయంలో కూడా ఆ పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యరులకు ఓట్లు పడ్డాయి. అంటే ఆ పార్టీకి ఉన్న ఓటు బ్యాంకు ఏమిటో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విస్తృతంగా పర్యటనలు, ప్రచారం చేస్తుండడంతో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. దీంతో వైసీపీకి నష్టం తప్పదని, టీడీపీకి మాత్రం పెద్ద ఎత్తున లాభం ఉంటుందని రాజకీయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మరి రానున్న ఎన్నికల్లో పరిస్థితి ఎలా ఉండబోతోందో వేచి చూడాల్సి ఉంది.

వైభవంగా అంపకోత్సవం

- వనంగుడికి చేరుకున్న పోలమాంబ ఘటాలు
- 30న మారు జాతర

మక్కువ, జనవరి 24 : శంబర జాతరలో చివరి ఘట్టం.. పోలమాంబ అంపకోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. తొలుత చదురుగుడి నుంచి గ్రామంలోని నడివీధికి అమ్మవారి ఘటాలను తీసుకొచ్చారు. అనంతరం మంగళవాయిద్యాలతో ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని నిర్వహించారు. గిరడ, కరణం, నాయుడు కుటుంబాలతో పాటు వడిగళ్ల, తీళ్ల, పూడి కుటుంబీకులు, గ్రామస్థులు , భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలు గోముఖీ నదీతీరం దాటే వరకు సంప్రదాయం ప్రకారం రజకులు చీరలు పరిచారు. వాటిపై చిన్నారులను పడుకోబెట్టి ఆశీర్వాదాలు అందించారు. యాత్రా స్థలం నుంచి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న వనంగుడికి కాలినడకన అమ్మవారి ఘటాలను తీసుకెళ్లారు. వందలాది మంది భక్తులు వాటి వెంట నడిచారు. వనంగుడి వద్దకు చేరుకున్న ఘటాలతో పూజారి జన్నిపేకాపు భాస్కరరావు ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేసిన తర్వాత కట్టు వేశారు. ఈ కార్యక్రమంలో తప్పెటగుళ్ల, మహిళల కోలాటాలు, డప్పు వాయిద్యాలు, పోతురాజు వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరోవైపు పోలమాంబను దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు దీరారు. కాగా ఈ నెల 30న మారు జాతర నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సూర్యనారాయణ తెలిపారు.



పోలమాంబ

జాతర ఆదాయం రూ.21.11లక్షలు

శంబర పోలమాంబ జాతర ఆదాయం రూ.21.11 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. శీఘ్రదర్శనం ద్వారా రూ.3,21,600, ప్రత్యేక దర్శనం కింద రూ. 1,39,440, కేశఖండన ద్వారా రూ. 15,840, అన్నదానం కింద రూ.71,107, లడ్డు ప్రసాదం ద్వారా రూ.1,71,375 లభించినట్లు చెప్పారు.



అమ్మవారి ఘటాలను వనంగుడికి తీసుకొస్తున్న దృశ్యం



వన్నాంలో మొక్కజొన్న పంటను నాశనం చేస్తున్న గజరాజులు

ఏనుగుల హల్‌చల్

- పంటలు ధ్వంసం

కొమరాడ, జనవరి 24 : మండలవాసులను గజరాజులు హడలెత్తిస్తున్నాయి. రోజుకో చోట అవి సంచరిస్తూ.. భయాందోళన కలిగిస్తున్నాయి. తాజాగా బుధవారం ఏడు ఏనుగులు వన్నాం, దళాయిపేట గ్రామాల సమీపంలో ఉన్న మొక్కజొన్న, అరటి, కూరగాయల పంటలను నాశనం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. తక్షణమే ప్రభుత్వం పరిహారం అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం గజరాజులు వన్నాం గ్రామంలోని పంట పొలాల్లో తిష్ఠ వేశాయి. దీంతో పరిసర ప్రాంతవాసులు బెంబేలెత్తి పోతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏనుగుల వల్ల ఏటా ఆస్తి, పంటలు, ప్రాణ నష్టం సంభవిస్తున్నా.. సర్కారు స్పందించకపోవడంపై మండలవాసులు మండిపడుతున్నారు. ఈ ప్రాంతం నుంచి ఏనుగుల గుంపును తరలించాలని వారితో పాటు టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖర్‌పాత్రుడు తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

పర్యాటక పనులు వేగవంతం: కలెక్టర్

సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న పర్యాటక పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం సీతంపేటలోని గిరిజన మ్యూజియం పనులను పరిశీలించారు. ప్రధాన భాగమైన ఆభరణాల ప్రదర్శన, గిరిజన సంస్కృతిని తెలియజేసే కొన్ని భాగాలను తొలుత పూర్తి చేసి పర్యాటకుల సందర్శనకు వీలుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యూజియంలో చేపడుతున్న రెస్టారెంట్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయన ఆడలి వ్యూపాయింట్ పనులను పరిశీలించారు. మరుగు దొడ్లు, రెస్టారెంట్ పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. ఆడలి గ్రామం నుంచి వ్యూ పాయింట్ వరకు ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్డు సదుపాయం కల్పించాలని ఆదేశించారు. గిరి గ్రామం కార్యక్రమం కింద ఒక గ్రామాన్ని అభివృద్ధి చేసి పర్యాటకులు సందర్శించేలా తయారు చేస్తామన్నారు. ఆయన వెంట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి, టూరిజం రీజనల్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, టూరిజం జాయింట్ మేనేజర్ హరేరాం, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, ఈఈ సింహాచలం, డీఈ కృష్ణకుమార్, ఏఈ నాగభూషణ్ తదితరులు ఉన్నారు.



ఆడలి వ్యూపాయింట్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

బకాయిలు చెల్లించండి: యూటీఎఫ్

బెలగాం, జనవరి 24: ఉపాధ్యాయులకు తక్షణమే ప్రభుత్వం ఆర్థిక బకాయిలు చెల్లించాలని, ఐఆర్ 30శాతం అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు యజ్ఞం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ బకాయిల కింద సర్కారు సుమారు రూ.18వేల కోట్లను ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందన్నారు. టీచర్లు వారి అవసరాల కోసం దాచుకున్న డబ్బులను ఇవ్వమంటే ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఆ డబ్బులను దారి మళ్లించే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని సీఎం జగన్ మాట ఇచ్చి మడం తిప్పారని, ఇప్పటికైనా ఆ హామీ నెరవేర్చాలని నినదించారు. యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు యజ్ఞం చేస్తున్న ఉపాధ్యాయులు

ఊరు మారినా.. బతుకులు మారలే!

- వీరబ్రహ్మేంద్రపురంలో కనీస సౌకర్యాలు కరువు
- రోడ్లు, కాలువలు లేక ఇబ్బందులు
- చీకట్లో మగ్గుతున్న గిరిజనులు
- పట్టించుకోని అధికారులు

'ఉన్న గ్రామంలో వారు ఆప్తులను కోల్పోయారు. దీంతో దూరంగా వచ్చి జీవించాలని భావించారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అయినా వారి బతుకులు మారలేదు. కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. వారి బాధలు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. మా బతుకులు ఇంతేనా?' అంటూ మండలంలోని వీరబ్రహ్మేంద్రపురం గ్రామ గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

(జియ్యమ్మవలస)

అర్నాడ పంచాయతీలో వీరబ్రహ్మేంద్రపురం గ్రామం ఉంది. రెండేళ్ల క్రితం నూతనంగా ఏర్పడిన ఈ గ్రామంలో పదహారు కుటుంబాలు జీవిస్తున్నాయి. గతంలో వీరందరూ ఇదే పంచాయతీలో తుమ్మిగూడలో నివసించేవారు. అయితే, ఈ ప్రాంతంలో కొందరు వ్యక్తులు తక్కువ కాల వ్యవధిలో అకారణంగా చనిపోయారు. దీంతో భయభ్రాంతులకు గురైన ఈ పదహారు కుటుంబాల గిరిజనులు మిగిలిన గ్రామస్థులతో మాట్లాడి గ్రామంలో ఇంకోపక్కకు వచ్చేస్తామని, స్థలాలు ఇవ్వమని కోరారు. వారు ససేమిరా అనడంతో చేసేది లేక మండల స్థాయి అధికారులను సంప్రదించారు. దీంతో ఆ రెవెన్యూ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో వారు నివసించేందుకు రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చినట్లు గిరిజనులు చెబుతున్నారు. అయితే, ఇక్కడికి వచ్చిన తరువాత కనీస మౌలిక వసతులకు నోచుకోలేకపోయామని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

ఇవీ సమస్యలు

వీరబ్రహ్మేంద్రపురం గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేదు. కొవ్వొత్తుల వెలుగుల్లో గిరిజనులు జీవించాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రుళ్లు ఇళ్లలోకి విష సర్పాలు వచ్చేస్తున్నాయని వాపోతున్నారు. తమ బాధను చూడలేక జియ్యమ్మవలస గ్రామానికి చెందిన సత్యసాయి భక్తుడు ఎల్ఈడీ ల్యాంపులు వేసి కొంత ఊరట కలిగించినట్లు చెబుతున్నారు. పక్కా ఇళ్లు, సీసీ రోడ్లు, కాలువలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు చదువు కోసం మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. తాగునీటి బోరు ఉన్నా ఆ నీరు కొంత జిడ్డుగా, వాసన వస్తోందని చెబుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఆ నీటినే తాగుతున్నామని వాపోతున్నారు. ఇళ్ల స్థలాలు గత తహసీల్దార్ అప్పగించినప్పటికీ ఇంతవరకు పట్టాలు ఇవ్వలేదు. పక్కా ఇళ్లు మంజూరు కాలేదు. మల, మూత్ర విసర్జనకు ఆరుబయటకు వెళ్లాల్సిందే. వ్యక్తిగత మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గిరిజనులు చెబుతున్నారు.

అధికారుల నుంచి 'స్పందన' లేదు..

తమ సమస్యలపై వీరబ్రహ్మేంద్రపురం గ్రామస్థులు పలుమార్లు మండల స్థాయి స్పందన కార్యక్రమంలో అధికా రులకు వినతిపత్రాలు అందించారు. అయినా అధికారులు పట్టించుకోలేదని వాపోతున్నారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు, పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు సైతం స్పందన కార్యక్రమంలో, సాధారణ రోజుల్లో స్వయంగా సమస్యలను తెలియజేసినా తమ గోడు పట్టనట్టు ఉండిపోయారే తప్ప న్యాయం చేయలేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. కాగా, కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఈ గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వారి ఆదేశాలతో మండల ఏఈ బడే శ్రీనివాసనాయుడు పీవీటీజీ కింద సర్వే చేసి అంచనాలు కూడా పూర్తి చేశారు. త్వరలో విద్యుత్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు. మిగిలిన సమస్యలు కూడా పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వీరబ్రహ్మేంద్రపురం గ్రామం

'స్పందన'కు వెళ్లినా ...

మా గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు స్పందన కార్యక్రమంలో వినతి పత్రాలు అందించాం. ఐటీడీఏ లోనూ విన్నవించాం. కానీ ఎటువంటి ప్రయోజనం లేదు.

-సుందరరావు,
గిరిజనుడు,
వీరబ్రహ్మేంద్రపురం

ఇబ్బందులు పడుతున్నాం

రెండేళ్ల కిందట తుమ్మిగూడ నుంచి వీరబ్రహ్మేంద్రపురం వచ్చేశాం. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో నివసిస్తున్నాం. ఇక్కడ మౌలిక సదుపాయాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం.

- ఊయక లత, గృహిణి,
వీరబ్రహ్మేంద్రపురం

పట్టాలు అందిస్తాం

వీరబ్రహ్మేంద్రపురంలో గిరిజనులకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని తెలిసింది. వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

- సీతారామయ్య,
తహసీల్దార్,
జియ్యమ్మవలస

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి

చీపురుపల్లి: అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం ఆమె చీపురుపల్లి మండలంలోని విజయరాంపురం పోలింగ్ కేంద్రాన్ని, పట్టణంలో జరుగుతున్న కుల గణన ప్రక్రియను పరిశీలించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై ఆరా తీశారు. వీటిని త్వరితగతిన పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాల కోసం వినియోగించే భవనాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, విద్యుత్ సదుపాయం, ఫర్నీచర్, సరైన నామఫలకాలు వంటి ఆరు అంశాలు సంతృప్తికరంగా ఉండాలన్నారు. పట్టణంలోని శివరాం రోడ్డులో జరుగుతున్న కుల గణన తీరును పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె వెంట కుల గణన జిల్లా ఇన్‌చార్జి కె.సందీప్, చీపురుపల్లి ఆర్డీవో బి.శాంతి, తహసీల్దార్ ఎం.సురేష్, ఎంపీడీవో జి.గిరిబాల, కర్లాం వైద్యాధికారి సువర్ణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

రాజాం: అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాలుగా వినియోగించే భవనాల్లో తాగు నీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, విద్యుత్ సదుపాయం, ఫర్నీచర్, సరైన నేమ్ బోర్డులు తదితర ఆరు అంశాలు తప్పని సరిగ్గా ఉండాలని చెప్పారు. ఈ మేరకు రాజాం పురపాలక సంఘం పరిధిలోని వస్త్రపురికాలనీ, బొద్దాం గ్రామంల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కలగణన. ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లో అక్కడ వసతులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాంలో అందుబాటులో ఉంచిన ఓటరు జాబితాను పరిశీలించారు. ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ పై ప్రాధమిక ఆరోగ్య ఉపకేంద్రంలోతనిఖీ చేశారు. ఈఆర్వో సుధారాణి, ఆర్డీవో శాంతకుమార్, కులగణన నోడల్ అధికారి కె సందీప్‌కుమార్. తాహసీల్దార్ కృష్ణంరాజు, ఎంపీడీవో శంకరరావు, కమిషనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ● **గరివిడి:** గరివిడి మండలంలో కోడూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అచ్యుతరావు, సచివాలయం సిబ్బంది త హసీల్దార్ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.


రాజాం పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

చెక్క కోత మిషన్ తగిలి వ్యక్తి మృతి


సత్యారావు (ఫైల్)

కొత్తవలస, జనవరి 24: చెక్కలు కటింగ్ చేసే మిషన్ ప్రమాదవశాత్తు తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొమ్మోజు సత్యారావు(58) కార్పెంటర్‌గా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం గ్రామంలోని ఒక ఇంట్లో కార్పెంటరీ వర్కు చేస్తుండగా చెక్కలు కటింగ్‌కు ఉపయోగించే చిన్న మిషన్ పనిచేస్తున్న సమయంలో కట్టుకున్న లుంగీకి చుట్టుకుపోయి తరువాత కాలిపై పడడంతో కాలు తెగి తీవ్ర రక్తస్రావమైంది. దీంతో కేకలు విన్న గ్రామస్థులు అక్కడకు చేరుకుని రక్షించే ప్రయత్నం చేశారు. కొన ఊపిరితో ఉన్న బాధితుడిని 108కు ఫోన్ చేసి చికిత్సకు తరలించే ప్రయత్నం చేస్తుండగానే తుదిశ్వాస విడిచారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు సీఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టెం నిమిత్తం శృంగవరపుకోట సీహెచ్‌సీకి తరలించారు.

మహిళ అనుమానాస్పద మృతి

బొబ్బిలి: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి మండలం పాతపెంట గ్రామానికి చెందిన వెంకటరావుతో శ్రీకాకుళం జిల్లా చిన్నకొల్లివలసకు చెందిన పెంకి అరుణ(33)కు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారికి 17 ఏళ్ల కుమారుడు, 16 ఏళ్ల కుమార్తె ఉన్నారు. కూలీ చేసుకొని జీవనం సాగిస్తున్న వెంకటరావు-అరుణ దంపతుల మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఇటీవల ఆమె అస్వస్థతకు గురవడంతో అరుణ అన్నయ్య వెళ్లి ఆమెను తీసుకొచ్చి బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి మంగళవారం సాయంత్రం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఆమె కన్ను మూసింది. అరుణ భర్త తీవ్రంగా కొట్టడంతోనే ఆమె అస్వస్థతకు గురైనట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చదలవాడ తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

బొబ్బిలి: రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్ఐ జి. భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాతబొబ్బిలి గ్రామానికి చెందిన కుప్ప ఉదయ్‌కుమార్ అనే సిమెంట్ వ్యాపారి బైకుపై పట్టణానికి వస్తుండగా బుధవారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలో వెనుక నుంచి బైకుపై వస్తున్న ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ ఉమర్ బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఉదయ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానిక సీహెచ్‌సీలో ప్రథమచికిత్స చేసిన అనంతరం విశాఖ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు జీఆర్పీ ఎస్.ఐ వర్మ తెలిపారు. మృతుని వయస్సు సుమారుగా 25 సంవత్సరాలు ఉంటుందని, నీలం రంగు నిలువు అడ్డగీతల షర్టు, ఆర్మీ డిజైన్ కట్‌బనియన్, నల్లని జీన్‌ఫ్యాంట్ ధరించినట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 96665 55214, 94906 17089 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

రేగిడి: మండలంలో సంకిలి గ్రామానికి చెందిన వ్యక్తి నిర్వహిస్తున్న కిరాణా షాపులో 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రీనివాస్ బుధవారం స్థానిక విలేఖర్లకు తెలిపారు. సోదాల్లో భాగంగా బెల్ట్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేసి కోర్టు రిమాండ్‌కు తరిలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఏఎస్ఐ రాజారావు, సిబ్బంది శ్రీనివాసరావు, శివస్వామి తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో గిరిజన యువకుడి మృతి

శృంగవరపుకోట రూరల్: మండలంలోని బొడ్డవర పంచాయతీ గాదెల్లోవా గ్రామానికి చెందిన బూరి రాజేష్(22) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీనిపై స్థానిక గిరిజన యువత మాట్లాడుతూ గత కొద్దికాలంగా రాజేష్ బోన్‌కాన్సర్‌తో బాధపడుతూ విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందాడని, అయితే అక్కడ మందులకు, వైద్యపరీక్షలకు సొంతడబ్బులు పెట్టలేక ఆరోగ్యం విషమించిందన్నారు. గ్రామంలో పోడు వ్యవసాయం చేసుకునే రాజేష్‌కు ఆర్థిక స్థోమతు లేకపోవడంతో చనిపోయాడని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లాలోని గిరిజనులకు కేజీహెచ్‌లో ఉచిత వైద్యం అందేలా చూడాలన్నారు.

నేడు న్యాయవాదుల మోటార్ సైకిల్ ర్యాలీ

కొత్తవలస: ఏపీ రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం కొత్తవలస న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు సంఘ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ గిరిబాబు తెలిపారు. గురువారం 11 గంటలకు కోర్టు వద్ద బయలుదేరి కొత్తవలస జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తామని తెలిపారు. అక్కడి నుంచి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేస్తామన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తాం

రేగిడి: సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్స్ ఆధ్వర్యంలో సంకిలి, అప్పాపురం, దేవుదళ, లక్ష్మీపురం పంచాయతీలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీలో భాగంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏవీపీ పట్టాభిరామిరెడ్డి, హెచ్ ఆర్ హెడ్ మురళీకృష్ణ తెలిపారు. మజ్జిరాముని పేట, లక్ష్మీపురం గ్రామాల్లో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇటీవల నేత్ర వైద్య శిబిరాల ద్వారా 1900 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. బుధవారం నాటి శిబిరంలో 800మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మెడాల్ ఐకేర్ వైద్యులు డా.అనిల్ కుమార్, ఎస్.రామమూర్తి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, కెంబూరు వెంకటేశ్వరరావు, లక్ష్మీపురం ఎంపీటీసీ ఏర్నేన అప్పలనాయుడు, హెచ్‌ఆర్ సిబ్బంది స్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్వర్‌లు పనిచేయక నిలిచిన రిజిస్ట్రేషన్‌లు

కొత్తవలస: రిజస్ట్రేషన్‌లకు సర్వర్ కష్టాలు తీరడం లేదు. బుధవారం సర్వర్ పనిచేయక పోవడంతో రిజస్ట్రేషన్‌ల కోసం కార్యాలయానికి వచ్చిన పార్టీలు రిజస్ట్రేషన్‌లు జరగక సాయంత్రం వరకు ఉండి ఉసూరుమని వెనక్కి వెళ్లారు. బుధవారం ఉదయం నుంచి సర్వర్‌లు పనిచేయక పోవడంతో రిజస్ట్రేషన్‌లకు ప్రతి రోజూ ఆటంకాలు ఎదురవుతునే ఉన్నాయి. ఒక రోజు ఈకేవైసీ పనిచేయక పోతే మరో రోజు చలానాలు జనరేట్ కాక ప్రక్రియ నిలచి పోతోంది. కార్యాలయంలోనే పరిస్థితులు ఇలా ఉంటే సచివాలయాలకు రిజస్ట్రేషన్ ప్రక్రియ అప్పగిస్తే పరిస్థితి మరెంత దారుణంగా ఉంటుందోనని పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారంలో కనీసం నాలుగు రోజులు పరిస్థితి ఇదే విధంగా ఉంటోందంటున్నారు. గతంలో ఎప్పుడు ఇటువంటి సమస్యలు ఎదురుకాలేదంటున్నారు. బుధవారం సాయంత్రం వరకు క్రవిక్రయదారులు ఏసమయంలోనైనా సర్వర్లు పనిచేయక పోతాయా అని ఎదురు చూసి నిరాశగా వెనుతిరిగారు.

నేడు 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ'

విజయనగరం రూరల్: విజయనగరంలోని 12, 16 డివిజన్లలో టీడీపీ ఆధ్వర్యంలో గురువారం 'బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు పాల్గొంటారని పేర్కొన్నారు.

దుప్పట్ల పంపిణీ

విజయనగరం రింగురోడ్డు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని నేతాజీ మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైల్వే స్టేషన్, ఆర్టీసీ ప్రాంతాల్లో నిరాశ్రయులకు, పేదలకు దుప్పట్లు, ఆహార పొట్లాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు పి గుణకరరావు మాట్లాడుతూ, తమ సంఘం ఆధ్వర్యంలో ఏటా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. మాజీ సైనికులు ప్రకాష్‌రావు, బొడ్డేపల్లి జగన్నాథ్, టీవీ నారాయణ రావు, మహంతి గణపతి, శివకుమార్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

విజయనగరం రింగురోడ్డు: అందరి సహకారంతో రానున్న రోజుల్లో సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని మేయర్ విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ అన్నారు. నగర పాలక సమావేశ మందిరంలో బుధవారం విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన 20 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మేయర్ వీవీ లక్ష్మీ మాట్లాడుతూ నగరంలో మిగిలివున్న అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టేలా అధికారులను ఆదేశించామన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని చెప్పారు. కమిషనర్ ఆర్‌శ్రీరాములునాయుడు, సహాయ కమిషనర్ ప్రసాద్‌రావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనేల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

భోజన నిర్వహణపై పర్యవేక్షణ అవసరం

రేగిడి: పాఠశాల మధ్యాహ్న భోజనం నిర్వహణలో ఉపాధ్యాయుల పర్యవేక్షణ, పరిసరాల పరిశుభ్రతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఎంఈఓ వరప్రసాదరావు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మజ్జిరామునిపేట యూపీ పాఠశాలను బుధవారం ఎంఈఓ ఆకస్మికంగా సందర్శించారు. హెచ్ఎం భువనేశ్వరికి వివిధ అంశాలపై సూచనలు చేశారు. ఎంఐసీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సీఆర్ఎంటీ వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

తెర్లాం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో మండలంలోని వివిధ పాఠశాలల 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో త్రినాధరావు తెలిపారు. ఈ పోటీల్లో 'భారత ప్రజాస్వామ్యం- ఓటుహక్కు ప్రాధాన్యం' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

బూత్ కన్వీనర్ల సమావేశానికి హాజరుకండి

లక్కవరపుకోట: మండల కేంద్రమైన ఎల్.కోటలో గల మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఇంటివద్ద గురువారం జరగనున్న టీడీపీ బూత్ కన్వీనర్ల సమావేశానికి అందరూ హాజరుకావాలని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు కోరారు. వేపాడ, ఎల్.కోట మండలాలకు చెందినవారు ఎల్.కోటకు, జామి, ఎస్.కోట మండలాల వారు ఎస్.కోటకు, కొత్తవలస వారు అక్కడే సమావేశమవ్వాలని తెలిపారు. కన్వీనర్లతో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు కోరారు.

ఎస్.కోట బీఎస్పీ ఇన్‌చార్జిగా బోనుకృష్ణ

కొత్తవలస: శృంగవరపుకోట నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జిగా బోను కృష్ణను నియామకం చేస్తూ రాష్ట్ర బీఎస్పీ అధ్యక్షుడు బి.పరంజ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విశాఖపట్టణం బీఎస్పీ అధ్యక్షుడుగా బోనికృష్ణ వ్యవహరిస్తున్నారు. మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన బోనుకృష్ణ వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో శృంగవరపుకోట నియోజకగర్గం నుంచి బీఎస్పీ తరపున పోటీ చేస్తారని తెలిపారు. అందు చేత పార్టీని బలోపేతం చేసి నియోజకవర్గంలో బీఎస్పీ విజయం దిశగా చర్యలు తీసుకోవాలని కృష్ణను ఆదేశించారు. తనపై ఎంతో నమ్మకంతో నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియామకం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలను పర్యటించి బీఎస్పీని బలోపేతం చేస్తానని తెలిపారు.

ఉపాధిలో జాప్యం వద్దు

రేగిడి: గృహ నిర్మాణదారులకు ఉపాధి కింద ఇవ్వవలసిన 90 రోజుల పనిదినాల విషయంలో సిబ్బంది అలసత్వం వహించవద్దని ఏపీఓ ఎస్.హరనాథ్ సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో బుధవారం ఏపీఓ, క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో వారాంతపు సమీక్ష నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో హౌసింగ్‌లో ఉపాధి చెల్లింపుల వెనుకబాటుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమీక్షలో ఈసీ రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సన్నద్ధం

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకలకు పోలీస్ శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో బాగంగా బుధ వారం జిల్లా పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో వేడుకలకు పోలీస్‌లు ముందుగా మాల్ ప్రాక్టీస్ నిర్వహించారు. వందలాది మంది పోలీస్‌లు ప్రాక్టీస్ కవాతులో పాల్గొన్నారు. ముఖ్యఅతిథులు గౌరవ వందనం స్వీకరించే మార్గంలో ట్రైల్‌రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ యూనివర్స్ మాట్లాడుతూ జనవరి 26న జరగబోయే వేడుకలకు పోలీస్ శాఖ అంతా సిద్ధం చేసిందన్నారు. శుక్రవారం జరిగే గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికారుల సూచనలతో పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చెశామని, రేపటి వేడుకల్లో జిల్లా అధికారులు, నాయకులు పాల్గొంటారన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

● రేగిడి మండలంలో పార్టీ తీర్థం పుచ్చుకున్న 450 కుటుంబాలు

రేగిడి, జనవరి 24: మండలంలో వైసీపీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇటీవల ఆరు గ్రామాల్లో వైసీపీ నేతలు, శ్రేణులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పగా తాజాగా బుధవారం మరో రెండు గ్రామాల వైసీపీ నేతలు, శ్రేణులు జలక్ ఇచ్చారు. పెద్దశిర్లాం మాజీ సర్పంచ్ పాలవలస రామచంద్రినాయుడు తమ అనుచరులుగా ఉన్న 250 కుటుంబాలతో కలిసి టీడీపీ తీర్థం స్వీకరించారు. ఇదే పంచాయతీకి చెందిన నలుగురు వార్డుమెంబర్‌లు రెడ్డి సత్యన్నారాయణ, సంచాల కన్నంనాయుడు, మారళ్ల రాములమ్మ, కోట్లు సింహద్రినాయుడు, మాజీ ఎంపిటిసి సంచాన అప్పలనాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ కోట్ల అమ్మాజి ఇంకా పదుల సంఖ్యలో కుటుంబాలు టీడీపీలో చేరాయి. సాయంత్రం ఖండ్యాంలో నిర్వహించిన కార్యక్రమంలో వైసీపీ మద్దతదారుడు గొల్వి హరిప్రసాద్ ఆధ్వర్యంలో 200 కుటుంబీకులు టీడీపీలో చేరాయి. బుధవారం ఈరెండు గ్రామాల్లో కోండ్రుకు దారిపొడువునా ఘనస్వాగతం పలికారు.

● సీఎం జగన్‌రెడ్డి చేస్తున్న విధ్వంసక పాలన, చేస్తున్న వరుస తప్పులతో ఈ ప్రభుత్వం పతనం అంచున ఉందని, వీటిని ప్రజలు, నేతలు గమనించి పార్టీ మారుతున్నారని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఈరెండు గ్రామాల్లో నిర్వహించిన వేర్వేరు బహిరంగ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తప్పులు ఎత్తిచూపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు, గురువాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ మంతిన ఉషారాణి, వి.నాగభూషణరావు, పాలూరి రామినాయుడు, గురవాన ధనంజయ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ఖండ్యాంలో వైసీపీ క్యాడర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోండ్రు

తెర్లాం మండలంలో..


పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న బేబీనాయన

తెర్లాం: చీకటిపేట గ్రామంలో వైసీపీని వీడి సుమారు 30 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ విధి విధానాలు నచ్చక పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. పార్టీలో చేరిన వారిలో పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ చీకటి తిరుపతినాయుడు, చీకటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగాల కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యవత కార్యనిర్వాహక కార్యదర్శి అమరాపు సురేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి యుగంధర్, మాజీ ఎంపీపీ సింహాచలం, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జయహో బీసీ విజయవంతం


మాట్లాడుతున్న నాయకులు

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ స్థాయిలో ఈనెల 23న నిర్వహించిన 'జయహో బీసీ' సదస్సు విజయవంతమైందని టీడీపీ నాయకులు కంది మురళీ నాయుడు, ముద్దాడ చంద్రశేఖర్, కోండ్రు శ్రీనివాసరావులు చెప్పారు. బుధవారం పార్టీ కార్యాలయంలో టీడీపీలోని బీసీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. నాలుగున్నర ఏళ్ల కాలంలో బీసీలకు ఈ ప్రభుత్వం మొండి చేయి చూపిందన్నారు. విధులు, అధికారాలు, కుర్చీలు లేని కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి, పదవులు కట్టబెట్టారన్నారు. బీసీలంతా రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు వేచలపు శ్రీను, నాయుడు, బోని కుమార్, ఇప్పిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి మహిళలకు శిక్షణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట: విద్యా సంకల్పంలో భాగంగా ఫిబ్రవరి 15 నుంచి శృంగవరపుకోట పట్టణంలో బ్యుటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు గొంప కృష్ణ విద్యాసంకల్పం గోడపత్రికను ఆవిష్కరించారు. శిక్షణ పొందాలనుకునే మహిళలు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 10లోపు మొదటి బ్యాచ్‌కు టైలరింగ్‌కు 80 మంది, బ్యుటీషియన్ కోర్సుకు 20 మంది మహిళలను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు 93989 79435, 98855 77145 నెంబర్‌లను సంప్రదించవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆఫ్‌లైన్‌లో శృంగవరపుకోట మండలానికి సంబంధించి రాయవరపు చంద్రశేఖర్ 93984 28283. తులసి 83743 26843 నెంబర్‌కు, జామి మండలంలో ఇప్పాక త్రివేణి 94943 33042, లగుడు రవికుమార్ 94405 40102లకు, వేపాడ మండలంలో గుమ్మడి భారతి 93951 61557, గొంప తులసి 91336 77848, లక్కవరపుకోట మండలంలో గనివాడ సతీష్ 82472 18928, కొత్తవలస మండలంలో సత్యనారాయణ 9490106778, రాజేష్ 7989466534 నెంబర్‌లకు సంప్రదించాలని కోరారు. నాయకులు లగుడు రవికుమార్, రాయవరపు చంద్రశేఖర్, రెడ్డి పైడిబాబు, జుత్తాడ రామసత్యం, మాదిబోయిన మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ నేరం

వేపాడ, జనవరి 24: అరిగిపాలెంలో ఎస్సీ, బీసీల మధ్య జరిగిన ఘర్షణ కారణంగా ఎస్సీలను సాంఘికంగా బహిష్కరించడం దారుణమని తహశీల్దార్ కె.ప్రసన్నకుమార్, వల్లంపూడి ఎస్ఐ కె.రాజేష్‌లు అన్నారు. ఈ నెల 21, 22, 23 తేదీలలో గ్రామ దేవత తీర్థం సందర్భంగా కబడ్డీ పోటీల వద్ద ఎస్సీ, బీసీ యువకుల మధ్య చోటు చేసుకున్న చిన్న పాటి ఘర్షణ వల్ల గ్రామ పెద్దలు ఎస్సీలను సాంఘిక బహిష్కరణకు గురి చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. ఎస్సీలతో ఎవరైనా మాట్లాడినా రూ.5వేలు జరిమానా విధిస్తామని హెచ్చరికలు జారీ చేయడం తప్పన్నారు. ఈ సందర్భంగా కిరాణ షాపుల యజమానులను పిలిపించి ఎస్సీలకు సామాన్లు ఇవ్వాలని సూచించారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చిట్టంపాడును సందర్శించిన డీఎంహెచ్‌వో


చిట్టంపాడులో గిరిజనులకు వైద్య పరీక్షలు చేయిస్తున్న డీఎంహెచ్‌వో

శృంగవరపుకోట రూరల్: మండలంలోని బొడ్డవర పంచాయతీ గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడు గ్రామాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు సందర్శించారు. బుధవారం గ్రామానికి చేరుకున్న ఆయన కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి హారిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం పర్యవేక్షించారు. అనంతరం ఇటీవల చనిపోయిన కుటుంబాల వారిని పరామర్శించారు. వారి అనారోగ్యం గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ నాయకుడు గౌరీష్ మట్లాడుతూ వైద్యులను తమ కొండపైకి పంపించాలని, వైద్యశిబిరాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయించాలనీ కోరారు. ఇక్కడి గిరిజనులు వైద్యం కోసం విశాఖకు వెళితే ఉచిత సేవలు అందడంలేవని, దీనివలన గిరిజనులు చాలా ఇబ్బందులు పడు తున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ తెలియజేయాలని కోరారు. చిట్టంపాడు గ్రామానికి ఆశావర్కర్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. ఈ విషయాలను కలెక్టర్‌కు వివరిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించడంలో అలసత్వం వద్దని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్యశాఖ సిబ్బంది ఉన్నారు.

మానవహారాలు, ర్యాలీల నిర్వహణకు ఏర్పాట్లు

కలెక్టరేట్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కేంద్ర ఎన్నిక సంఘం ఆదేశాల మేరకు గురువారం విజయనగరంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు డీఆర్వో అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయోధ్య మైదానం, గురజాడ కళాభారతిలో ఓటర్ల దినోత్సవ కార్యక్రమాలు ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయోధ్య మైదానం నుంచి పాఠశాల విద్యార్థులతో మానవహారం, నేను ఓటు వేస్తాను అనే ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన, ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన శకటం ఆవిష్కరణ ఉంటాయన్నారు ఉదయం 10.30 గంటలకు నుంచి గురజాడ కళాభారతిలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి అవార్డులు, ప్రశంసాపత్రాలు బహుకరణ, అతిథుల సందేశాలు ఉంటాయన్నారు. జిల్లా న్యాయాధికారి బి.సాయికళ్యాణ చక్రవర్తి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు.

అక్రమ తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

వేపాడ: బొద్దాం రెవెన్యూ సర్వే నెంబరు 105/2లోగల మెట్ట పోరంబోకు భూమిలో పశువుల ఆస్పత్రికి ఆనుకొని భవన నిర్మాణాలకు చేపట్టే అక్రమ పునాది తవ్వకాలను గ్రామ రెవెన్యూ అధికారి డీవీ రమణ అడ్డుకున్నారు. ఇది ప్రభుత్వ స్థలమని, ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నట్టు తెలుస్తోంది. గ్రామానికి చెందిన మహ్మద్ హసేన్‌బీ అలియాస్ పెంటమ్మకు భర్త సీలార్ ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా పోలీసు కేసులు పెడతామని వీఆర్వో హెచ్చరించారు.

'ఆడుదాం ఆంధ్రా'లో మాకు అన్యాయం

● బొబ్బిలి మండల కబడ్డీ జట్టు ఆరోపణ

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ గురుకుల పాఠశాల మైదానంలో బుధవారం జరిగిన నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలో తమకు తీరని అన్యాయం జరిగిందని బొబ్బిలి మండల కబడీ జట్టు సభ్యులు ఆరోపించారు. బుధవారం రాత్రి క్రీడామైదానంలో విలేకరులతో వారు మాట్లాడారు. జట్టు కెప్టెన్ బి.సతీష్ మాట్లాడుతూ బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామానికి చెందిన కబడ్డీ జట్టు-తెర్లాం మండలం జట్టుతో ఫైనల్స్ ఆడామని, 15 నిమిషాలు ఆడిన తరువాత ఐదు నిమిషాలు బ్రేక్ ఉంటుందని, మళ్లీ 15 నిమిషాలు ఆడాల్సి ఉందన్నారు. ఆఖరి ఒక్క నిమిషం ఉండగా అంపెర్లు ఏకపక్షంగా వ్యవ హరించడంతో తాము అభ్యంతరం చెప్పామన్నారు. ఈ లోగా ఆట సమయం ముగిసిందని చెప్పి వెంటనే తెర్లాం జట్టును విజేతగా ప్రకటించారన్నారు. వాస్తవానికి ఏ మండలం జట్టు సభ్యులు ఆ మండలానికి చెందిన అంపైర్లను నియమించకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ అలా పాటించలేదన్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవోకు ఇతర అధికారులకు చెబితే సాంకేతికపరంగా అంపైర్లు చెప్పిందే ఫైనల్ అని చెప్పి తప్పించుకున్నారన్నారు. ఇది చాలా అన్యాయమని, ఫైనల్ పోటీలను కచ్చితమైన అంపైర్ల సమక్షంలో మళ్లీ నిర్వహించాలని కెప్టెన్ సతీష్‌తో పాటు మెట్టవలస గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు ఇతర పెద్దలు డిమాండ్ చేస్తున్నారు. అంపైర్లపై కొంతమంది అసంతృప్తి వ్యక్తం చేస్తూ వాదనకు దిగారు. ఆ సయమంలో పోలీసులెవరూ లేకపోవడం గమనార్హం.


విలేకరుల ముందు ఆరోపిస్తున్న బొబ్బిలి మండల కబడ్డీ జట్టు

మేము పక్షపాతంగా వ్యవహరించలేదు

క్రీడా పోటీలను నిబంధనల ప్రకారం చాలా నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నాం. గెలుపోటములు నిర్ణయం అయినప్పుడు అసంతృప్తి సహజంగా ఉంటుంది. అంపైర్లను సొంతమండలం వారిని నియమించలేదు . బొబ్బిలి-తెర్లాం జట్ల మధ్య ఫైనల్ పోటీలు జరిగినప్పుడు బాడంగి మండలానికి చెందిన పీడీలు అంపైర్లుగా వ్యవహరించారు. మాకు క్రీడాకారులందరూ సమానమే.

-నల్ల వెంకటనాయుడు, గ్రౌండ్ ఇన్‌చార్జి

ఘనంగా ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం

విజయనగరం రింగురోడ్డు, జనవరి 24: ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం డ్రైవర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోలో మొదటి సర్వీసు నుంచి ప్రతి డ్రైవర్‌కు జిల్లా ప్రజా రవాణాధికారి సీహెచ్ అప్పలనారాయణ, డిపో మేనేజర్ శ్రీనివాసరావులు పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజారవాణాధికారి అప్పలనారాయణ మాట్లాడుతూ బస్ కండిషన్, డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రత ఉండాలన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సేవ లందించాలని సూచించారు. ప్రమాదాలను తగ్గించి ఇంధనం ఆదా చేయా లన్నారు. వాహనాల నిర్వహణపై అవగాహన, ఎప్పటికప్పుడు మరమ్మతుల ద్వారా ప్రమాదాలు, మరణాల సంఖ్యను తగ్గించడం సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ సిబ్బంది బుధవారం రహదారి భద్రతా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. హ్యాపీ డ్రైవర్స్ డే సందర్భంగా థాంక్యూ డ్రైవర్ గారూ అంటూ పుష్ప గుచ్చాలు, మిఠాయిలు పంచిపెట్టారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డిపో మేనేజర్ కె.రమేష్ వివరించారు. విజయనగరం రీజియన్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.వేణు పాల్గొన్నారు.


డ్రైవర్లను అభినందిస్తున్న జిల్లా ప్రజారవాణాధికారి అప్పలనారాయణ

ఆసరా కాదు.. అక్కా చెల్లెమ్మలకు టోకరా

● వైసీపీ ప్రభుత్వ తీరుపై టీడీపీ నాయకుల విమర్శ

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చేది 'ఆసరా' కాదని.. అక్కా చెల్లెమ్మలకు పెద్ద టోకరా అని టీడీపీ నాయకులు ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వ తీరుపై వారు బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి విధానాలను ఎడ్డగట్టారు.

సిగ్గుమాలిన చర్య కాదా?


మాట్లాడుతున్న గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు: జీతాలు పెంచమని వేడుకున్న అంగన్‌వాడీలపై కక్షకట్టి ఉక్కుపాదం మోపిన జగన్‌రెడ్డి.. ఆసరా కింద మహిళలను ఉద్దరిస్తాననడం సిగ్గుమాలిన చర్య కాదా.. అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి ప్రశ్నించారు. పట్టణంలోని తన నివాసంలో ఆమె బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇది జగన్ ఆసరా కాదని అక్క చెల్లెమ్మలకు పెద్ద టోకరా అని ఆమె ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కోటీ 14 లక్షలు మంది మహిళలు ఉంటే 79 మంది లక్షల మందికి మాత్రమే ఆసరా అంటూ సకాలంలో డ్వాక్రా రుణాలు చెల్లించిన 75 శాతం మందికి టోకరా వేశారని ఆమె ఆరోపించారు. ఉన్నతి పథకం పేరుతో ఎస్సీ, ఎస్టీ మహిళలకు చంద్రబాబు రూ.800కోట్లు ఇస్తే జగన్‌రెడ్డి ఆ పథకాన్ని రద్దు చేశారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, డబ్బి కృష్ణ, వైదేహి, వాడాడ శోభారాణి, బలగ శ్రీను, కారేపు చంద్ర తోపాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇచ్చేది గోరంత.. దోచుకునేది కొండంత


మాట్లాడుతున్న జయకృష్ణ

పాలకొండ (వీరఘట్టం): మహిళల మాంగళ్యాలు తెంచిన జగన్‌రెడ్డి ఇచ్చేది గోరింత, దోచుకునేది కొండంత అని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ ఆరోపించా రు. వీరఘట్టం మండలంలోని హుస్సేన్ పురం గ్రామంలో ఆయన బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. డ్వాక్రా రుణమాఫీ, పసుపు కుంకుమ ద్వారా చంద్రన్న పాలనలో కోటిమంది మహిళలు ఒక్కొక్కరు రూ.20వేలు లబ్ధి పొందారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఒక్కొక్క మహిళ పొందిన లబ్ధి రూ.15వేలు అని చెప్పారు. ఈ రకంగా 50 లక్షల మంది డ్వాక్రా మహిళలకు జగన్‌రెడ్డి టోకరా వేశారని జయకృష్ణ విమర్శించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, పొన్నాడ నాగేశ్వరరావు, జామి లక్ష్మీనారాయణ, ఉదయాన ఉదయ్‌భాస్కర్, చింత ఉమ, చందక వెంకటరావు, రౌతు వెంకటనాయుడు, జగదీష్, పక్కి శివుడు, రౌతు కృష్ణ ఖండాపు హరిబాబు, శంకరరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన అప్పారావు

రాష్ట్ర దాసరి సాధికార సమితి అధ్యక్షుడు తుపాకుల అప్పారావు బుధవారం టీడీపీలో చేరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జయకృష్ణ ఆధ్వర్యంలో ఆయన పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర సాధికార సమితి మెంబర్ పడాల రామకృష్ణ, పొట్నూరు రత్నాజీ, కొలిపోలు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మోసం


మాట్లాడుతున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: నోరు తెరిస్తే అక్కా చెల్లెళ్లంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పే జగన్ మహిళలకు నిట్టునిలువునా మోసం చేస్తున్నారని టీడీపీ కురుపాం నియోజకవర్గం ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి విమర్శించారు. బుధవారం ఆమె గుమ్మలక్ష్మీపురంలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. డ్వాక్రా సంఘాలను కూకటి వేళ్లతో పెకిలిస్తున్న జగన్‌రెడ్డి ఆసరా పేరుతో పొదుపు సంఘాలకు ఉద్ధరించేటట్టు మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించడం కాక మరేమిటన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు పావని, ఉపాధ్యక్షురాలు లావణ్య, మహిళా ప్రధాన కార్యదర్శి వెంపటాపు భారతి తదితరులు ఉన్నారు.

దారుణంగా మోసం చేశారు..

విజయనగరం రూరల్: అనేక హామీలు ఇచ్చి మహిళలను నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్ స్త్రీలను దారుణంగా మోసం చేశారని విజయనగరం నియోజకవర్గం ఇంచార్జి అదితి గజపతిరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డ్వాక్రారుణాలు, పసుపు-కుంకుమ ద్వారా చంద్రబాబు పాలనలో మహిళలందరూ సమానంగా రూ.20 వేలు లబ్ధి పొందారు. జగన్ పాలనలో ఒక్కో మహిళకు రూ.15వేలకు తగ్గిపోయిందన్నారు. సున్నా వడ్డీ రూ.5లక్షలని, జగన్ పాలనలో రూ.3 లక్షలకు కుదించేశాడు అన్నారు. జాతీయ స్థాయిలో మహిళలై ఆఘాత్యాలు 66.4 శాతం కాగా, రాష్ట్రంలో 96.2 శాతంగా ఉందన్నారు. గడిచిన నాలుగేళ్లల్లో జగన్ రెడ్డి మహిళలకు టోకరా వేశారని, మహిళా భద్రతలో డొల్లతనాన్ని తెలియజేస్తుందన్నారు.

మాంగళ్యాలు తెంచి..

శృంగవరపుకోట: 'నాసిరకం మద్యంతో మహిళల మాంగళ్యాలు తెంచిన జగన్ రెడ్డీ... నువ్విచ్చేది ఆసరా కాదు.. టోకరా' అని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విమర్శించారు. బుధవారం స్థానిక అన్న క్యాంటీన్ వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. తెలుగుదేశం పాలనలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, పసుపు కుంకుమ ద్వారా కోటి మంది రూ.20 వేల వంతున లబ్ధి పొందారని చెప్పారు. జగన్ రెడ్డి ఈ మొత్తాన్ని రూ.15 వేలకు కుదించారన్నారు. సొంత బాబాయ్ హత్య కేసులో నరహంతకులను రక్షిస్తున్న జగన్ రెడ్డి మహిళల ద్రోహి కాదా అని ప్రశ్నించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొణదం మల్లేశ్వరరావు, సరిపల్లి రామకృష్ణ, పొట్నూరు అప్పలరాజు, పెదగాడి రాజు, చెక్క కిరణ్‌కుమార్, రాయవరపు రవి కుమార్, కునిశెట్టి రాముడు, భోనంగి లక్ష్మి, పోలిమేర మహాలక్ష్మి పాల్గొన్నారు.



ఎస్.కోటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

సీపీఎస్ రద్దు చేసి పీఆర్సీ ప్రకటించాలి


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పాలకొండ: ఉపాధ్యాయులకు సంబంధించి సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్సీ ప్రకటించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఆర్డీవో లావణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 11వ పీఆర్సీ, డీఏ అరియర్స్ రూ.7,382 కోట్లు వెంటనే చెల్లించాలని కోరారు. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న వెయ్యి కోట్లుకు పైగా పీఎఫ్ లోన్లు, పార్ట్‌ఫైనల్ పేమెంట్లు వెంటనే చెల్లించాలన్నారు. గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.4,500 కోట్లు సరెండర్ లీవుల బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ-2003 టీచర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పాత పింఛన్ నిబంధనలు వర్తింప చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో బీటీఏ నాయకులు తండాడి అనీల్‌కుమార్, గొల్ల ఉమామహేశ్వరరావు, మజ్జి సోమేశ్వరరావు, కాయల బాలయేసు, గడ్డెయ్య, గొట్టుపల్లి సతీష్, శేఖర్, పిసిని జయమ్మ తదితరులు ఉన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

● పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్


మాట్లాడుతున్న పీవో చరణ్

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి): జిల్లావాసులు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎద గాలని ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ సూచించారు. బుధ వారం గిరిమిత్ర భవనంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు ఎంతో అవసరమన్నారు. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు జిల్లావాసులు ముందుకు రావాలని సూచించారు. అర్హత కలిగిన వారికి కేంద్ర ప్రభుత్వం మొదటి విడతగా ఐదు శాతం వడ్డీతో రూ. లక్ష బ్యాంకు ద్వారా రుణం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కరుణాకర్, డీపీవో బి.సత్యనారాయణ, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయికుమార్, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

● సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి


ర్యాలీలో పాల్గొన్న పీవో కల్పనాకుమారి

సీతంపేట: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐటీడీఏ పీవో కల్పనా కుమారి అన్నారు. బుధవారం బాలికా దినోత్సవం సందర్భంగా సీతంపేటలో నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె.. బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన కల్పించారు. సీతంపేట సామాజిక భవనం నుంచి అడ్వెంచర్ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీడీ అన్నాదొర, డిప్యూటీ డీఈవో లిల్లీరాణి, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, సీఎంవో చిరంజీవులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు జాతీయ బాలికా దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కేకే సాగర్‌వర్మ మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలు ప్రాముఖ్యతను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి మాట్లాడుతూ ఆడ పిల్లల హక్కులు, స్త్రీ విద్య, ఆరోగ్యం, పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి బాలికల దినోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్య సిబ్బంది సీహెచ్ ఉదయకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు పి.కృష్ణవేణి, ఆర్.పద్మ, ఎం.స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

● **గుమ్మలక్ష్మీపురం:** బాలికా దినోత్సవం సందర్భంగా భద్రగిరి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. భద్రగిరి అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం నుంచి గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో సుశీలాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

సీతానగరం: మండలంలో గెడ్డలుప్పి గ్రామం సువర్ణముఖి నదిపై ఉన్న వంతెన నిర్మాణ పనులను టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర బుధవారం పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న వంతెన పనులను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

గోపాలపురంలో బాబు ష్యూరిటీ

పార్వతీపురం రూరల్: గోపాలపురం గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర బుధవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోకి వచ్చిన విజయచంద్రకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం జగన్‌రెడ్డి పాలనలో పదేళ్లు వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. రోడ్లు గోతుల మయంగా మారాయన్నారు. నిరుద్యోగం ఎక్కువయిందని ఆయన విమర్శించారు.


పార్వతీపురం రూరల్: విజయచంద్రకు స్వాగతం పలుకుతున్న దృశ్యం


అచ్చెన్నాయుడును సత్కరిస్తున్న నాయకులు

అచ్చెన్నను కలిసిన టీడీపీ నాయకులు

పాలకొండ: శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును స్థానిక పార్టీ నాయకులు బుధవారం కలిశారు. పాలకొండ మాజీ జడ్పీటీసీ సామంతుల దామోదరరావు, పాలకండ 17వ వార్డు కౌన్సిలర్ గుమ్మడి సింహాద్రి, టీడీపీ మండల అధ్యక్షుడు సత్తిబాబు, జనసేన నాయకులు ప్రశాంత్‌కుమార్.. ఆయన్ని కలిసి, సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలోని టీడీపీ స్థితిగతులపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని అచ్చెన్నాయుడు కోరారు.

సర్వే వేగవంతం చేయాలి


గొట్టివలసలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో, తదితరులు

గరుగుబిల్లి: గ్రామాల్లో కుల గణన సర్వేను వేగవంతం చేయాలని సూపర్‌వైజర్ ప్రసాదరావు సూచించారు. మండలంలో నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియ పరిశీలనకు ఎంపీడీవో జి.పైడితల్లి పంచాయతీలవారీగా సిబ్బందిని బుధవారం నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌లో పొందుపర్చిన అంశాలను విధిగా వివరించి నమోదు చేయాలన్నారు. ఈ నెల 28లోగా పూర్తి చేయాలని సూచించారు. సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనలో సచివాలయ కార్యదర్శి తిరుపతి భాస్కరరావు, రెడ్డి కాంతి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చినశంబర పండగ


పోలమాంబను దర్శించుకుంటున్న భక్తులు

గరుగుబిల్లి: మరుపెంట పంచాయతీ సాంబన్నవలసలో చినశంబర పండగ బుధవారంతో ముగిసింది. గ్రామంలో సోమవారం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగింపు రోజున అమ్మవారికి ఎదురు మొక్కులు చెల్లించి భక్తిని చాటుకున్నారు.

ఐక్య పోరాటంతోనే విజయం

● కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల సంబరాలు

బెలగాం: సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు అకుంఠిత దీక్షతో 40 రోజులకు పైగా ఐక్యంగా పోరాటం చేయడం వల్లే విజయం సాధించామని యూనియన్ నాయకులు తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీల డిమాండ్లు అంగీకరించడంతో బుధవారం వారు స్థానిక సుదరయ్య భవన్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వరకు వచ్చి సంబరాలు చేశారు. పోరాటానికి మద్దతు తెలిపిన రాజకీయ పార్టీ నాయకులకు, వామపక్ష నాయకులకు, ప్రజసంఘాల నాయకులకు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎం.అలివేలు, గౌరీమణి, టి.రాజేశ్వరి, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

అరటి గెల బోద నుంచి 14 రకాల ఉత్పత్తులు

సాలూరు: అరటి గెల బోద నుంచి 14 రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా శాస్త్రవేత్త శ్రీనివాసరావు తెలిపారు. తోణాం పంచాయతీ ముంగివానివలసలో బుధవారం రైతులకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. త్వరలో రైతులకు అరటిగెలల బోధల నుంచి తయారు చేసే 14 రకాల ఉత్పత్తులపై త్వరలో శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చండి



ర్యాలీగా వెళ్తున్న పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది

సాలూరు: డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని డిపో మేనేజర్ భాస్కర్‌రెడ్డి, సీఐ జీడీ బాబు కోరారు. పట్టణంలో డ్రైవర్స్ డే సందర్భంగా ఆర్టీసీ కార్మికులు, మేనేజర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మేనేజర్‌తో పాటు పట్టణ సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. **పాలకొండ:** ఆర్టీసీ డ్రైవర్లు సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా పనిచేయాలని పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. డ్రైవర్స్ డే సందర్భంగా పాలకొండ ఆర్టీసీ డిపో నుంచి కాంప్లెక్స్ వరకు ఉద్యోగులు డిపో మేనేజర్‌తో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. డ్రైవర్లందరికీ గులాబీ పువ్వులను అందించారు. మేనేజర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సిస్టు లక్ష్మణరావు, అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్ ఎంకేఎం రాజు, హెడ్‌క్లర్క్ నాయుడు, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ బి.రాంబాబు, ఎన్ఈఐ రాజు, ఏడిసి కృష్ణమూర్తి, డ్రైవర్లు పాల్గొన్నారు.

వారణాసి ఘట్టం ప్రదర్శనకు తృతీయ బహుమతి


బొరోతు శంకరరావుకు బహుమతి అందిస్తున్న గోరటి

పాలకొండ: శ్రీకాకుళం జిల్లా హిరమండలంలోని చీమకుర్తి కళాపీఠంవారు ఈనెల 21న నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరిషత్ పోటీల్లో వారణాసి ఘట్టం ప్రదర్శనకు తృతీయ బహుమతి వచ్చింది. ఈ ప్రదర్శనలో పాలకొండకు చెందిన హరిశ్చంద్ర పాత్రధారి బొరోతు శంకరరావు, నక్షత్రక పాత్రధారి కెంబూరి కూర్మినాయుడు, వీరబాహు పాత్రధారి యందవ సత్యంనాయుడులకు ప్రముఖ వాగ్గేయ కళాకారులు గోరటి వెంకన్న బహుమతులు అందించారు. బొరోతు శంకరరావుకు పలువు కళాభిమానులు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా..

బహిరంగ వేలం వాయిదా

పార్వతీపురంటౌన్: పట్టణంలోని మున్సిపల్ నెహ్రూ మార్కెట్ పరిధిలోగల వివిధ షాపులు, ప్రధాన రహదారిలో తోపుడు బళ్లు, ఇతర వాహనాల నుంచి ఆశీలు వసూలుకు సంబంధించి బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన బహిరంగ వేలం పాట వాయిదా పడినట్లు రెవెన్యూ అధికారి డి.రూబేను తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఆశీలు బహిరంగ వేలానికి సంబంధించి సర్కారు వారి పాట రూ.23.76లక్షలుగా నిర్ణయించగా పాటదారులు ఎవరూ పాల్గొనకపోవడంతో వచ్చేనెల 9వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఆర్వో ప్రకటించారు. అయితే ఈనెలలో రెండు సార్లు జరిగిన ఆశీలుకు సంబంధించి బహిరంగ వేలంలో పాటదారులు పాల్గొనకపోవడంతో రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

చినమేరంగి ఎస్ఐగా చిన్నంనాయుడు

జియ్యమ్మవలస: చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఇ.చిన్నంనాయుడు నియమితులయ్యారు. ఈయన విశాఖ జిల్లా పెందుర్తి పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వచ్చి బుధవారం విధుల్లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నిరోధానికి కృషి చేస్తానని అన్నారు. అలాగే ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన కళాధర్‌కు జిల్లా కేంద్రంలో సీసీఎస్‌కు బదిలీ చేశారు.

ఆసరా చెక్కుల పంపిణీ

కురుపాం: కురుపాంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి గ్రామైక్య సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎంపీడీవో అప్పారావు, వైకేపీ ఏపీఎం ఈవీ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

అర్జున అవార్డు గ్రహీతకు సన్మానం

కురుపాం: కురుపాం గ్రామానికి చెందిన రిటైర్డు బాక్సర్, కోచర్, అర్జున అవార్డు గ్రహీత సీర జయరాంను ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి సన్మానించారు.కురుపాంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ప్రారంభించేందుకు వచ్చిన ఆమె జయరాంను సన్మానించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ (వీరఘట్టం): పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. వీరఘట్టం పట్టణంలోని సెయింట్ జేవియర్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం అగ్నిమాపక పరికరాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ధనరాజ్, ప్రిన్సిపాల్ మెర్లి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి

పాలకొండ: జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఐవో ఎం.నారాయణరావు సూచించారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్యసురక్ష-2 కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఐవో పాల్గొని ఓపీ, మందుల పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో జయగౌడ్, పట్టణ వైద్యాధికారి తేజ్‌రతన్‌రాజ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నూతన రైల్వే ప్లాట్‌ఫారాల పరిశీలన

రాయగడ: రైల్వే డివిజన్‌గా రూపుదిద్దుకున్న రాయగడలో అభివృద్ధి పనులు శరవేగంగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా నూతనంగా నిర్మించిన 1, 2, నెంబరు ప్లాట్ ఫారాలను డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్, కమిష నర్ ఫర్ రైల్వే సేఫ్టీ అధికారితో కలిసి బుధ వారం పరిశీలించారు. త్వరలో కొత్త రైల్వే ప్లాట్ ఫారం ప్రయాణికులకు అందుబాటులోకి రానుందని వారు తెలిపారు. ఇంతవరకు 1, 2, 3గా ఉన్న ప్లాట్‌ఫారాలు 3, 4, 5గా మారనున్నాయి.

నీటిని వృథా చేయవద్దు

ఒడిశా


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

రాయగడ: మానవ జీవితానికి ప్రాణాధరమైన నీటిని వృథా చేయవద్దని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మారు అన్నారు. స్థానిక అశోక్ మండపంలో జిల్లా యంత్రాంగం తరఫున పానీ పంచాయతీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో 2003లో పానీ పంచాయతీ కార్యక్రమం ప్రారంభం అయిందని, జిల్లా లో 87 పానీ పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. ఈసందర్భంగా నీటి పొదుపుపై పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కరచంద్రరౌయిత్, ఎంఐ డివిజన్ సూపరింటెండెంట్ ఇంజనీరు సుధాకర్ కుమార్, వ్యవసాయదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.